సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ౹ 22 ౹ సెప్టెంబర్ ౹ 2025



ప్రభుత్వాస్పత్రిలో గర్భశోకం

తొలి కాన్పు కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చిన మహిళకు వైద్యుల నిర్లక్ష్యంతో గర్భశోకం మిగిలింది. పుట్టిన మగ బిడ్డ మరణించింది.

-IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,13,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,280
3 శాతం జీఎస్టీతో	రూ.10,588
సవర (8 గ్రా)	రూ.84,704

గరిష్టం/కనిష్టం
35.8 /26.5

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా, అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇద్దరు జైలు అధికారుల సస్పెన్షన్

నెల్లూరు (క్రైమ్): రిమాండ్ ఖైదీ నుంచి నగదు వసూళ్లకు పాల్పడిన ఇద్దరు జైలు అధికారులు సస్పెండ్ అయ్యారు. జిల్లా కేంద్ర కారాగారంలో ఓ రిమాండ్ ఖైదీని బ్లాక్ మారుస్తామని చెప్పి చీఫ్ హెడ్‌వార్డర్ హనుమంతరెడ్డి, డిప్యూటీ జైలర్ ఎం. విజయకుమార్ ఫోన్‌పేలో నగదు వేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆ ఖైదీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించారు. నగదు వసూళ్లకు పాల్పడింది నిజమేనని తేలడంతో సదరు ఇద్దరు అధికారులను ఆదివారం విధుల నుంచి సస్పెండ్ చేశారు.

60 టన్నులకుపైగా రేషన్ బియ్యం పట్టివేత

• రెండు లారీలను సీజ్ చేసిన అధికారులు



బియ్యం లారీలో శాంపిల్స్ సేకరిస్తున్న సిబ్బంది, పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. చౌకదుకాణాల డీలర్ల నుంచి సేకరించిన బియ్యాన్ని హద్దులు దాటిస్తున్నారని ఆదివారం పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు సుభాన్‌నగర్‌లో ఐదు లారీల్లో బియ్యం ఉన్నాయని సమాచారం వచ్చింది. దీంతో ఏఎస్‌ఓ అంకయ్య, సీఎస్‌డీటీలు తనిఖీలు నిర్వహించారు. రెండు లారీల్లో 60 టన్నులకు పైగా బియ్యం, ఒక లారీలో ధాన్యం, రెండు లారీల్లో మినుములు ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి బియ్యం శాంపిల్స్ సేకరించారు. శాంపిల్స్‌ను పౌరసరఫరాల సంస్థ డీఎం కార్యాలయానికి పంపించి పరీక్షించి పీడీఎస్ బియ్యమని నివేదికలు వస్తే కేసులు నమోదు చేస్తామని ఏఎస్‌ఓ అంకయ్య తెలిపారు. లారీలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఏపీ ఎన్‌జీఓ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న పెంచలరావు

నెల్లూరు (అర్బన్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు సభ్యులు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ సూచించారు. ఆదివారం నెల్లూరు దర్గామిట్టలోని ఎన్‌జీఓ భవన్‌లో ఆ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కార్యవర్గ సభ్యులు అన్ని తాలూకాల్లోని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను, అధికారులను సభ్యులుగా చేర్చాలన్నారు. ఈ నెలాఖరులోపు ఓటర్ల జాబితాను అందజేయాలని కోరారు. అక్టోబర్ మొదటి వారంలో ఎన్నికలకు కార్యవర్గ సభ్యులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ సురేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కరుణమ్మ, కృష్ణంరాజు, సతీష్ బాబు, రాజేంద్రప్రసాద్, విజయకుమార్, కృష్ణకుమార్, సువర్ణ, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, చిన్నమ్మ, రఘులలిత్, చెంచురత్నం, జనార్దనయ్య, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ చాంపియన్ ఎస్‌ఆర్‌జేడీ



ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో రెండు రోజులపాటు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. కబడ్డీ చాంపియన్‌గా ఆత్మకూరు డాక్టర్ ఎస్‌ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. కబడ్డీ, చెస్ టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించగా నెల్లూరు జెనెక్స్ కళాశాల జట్టు రన్నర్‌గా, సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు చెస్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా నెల్లూరు రావూస్ కళాశాల జట్టు నిలిచింది. బహుమతి ప్రదానంలో ఎస్‌ఆర్‌జేడీ కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, యూనివర్సిటీ పరిశీలకుడు ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, రమణయ్య, వెంగళరావు, సతీష్, రవీంద్ర, అంకయ్య, సుప్రియ, పలు కళాశాలల వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



సర్కార్ వారి దోపిడీ
రూ.170 కోట్లు!

బొక్కుడుకు ఓ మంత్రి టెండర్

- వరద నుంచి భగత్‌సింగ్ కాలనీ రక్షణకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం
- పెన్నానదికి రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూ.100 కోట్లతో టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభం
- 50 శాతం మేర పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులు
- నాడు రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని విమర్శించిన టీడీపీ నేతలు
- నేడు వరద నియంత్రణకు ఇసుక బస్తాలతో తాత్కాలిక చర్యలు
- రూ.100 కోట్లకు ఖరారైన టెండర్ మొత్తాన్ని రూ. 270 కోట్లకు అంచనాలు పెంచి ప్రతిపాదనలు

సర్కార్ వారి దోపిడీకి టెండర్ ఖరారైంది. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ మంత్రి ఆ టెండర్‌కు రివైజ్డ్ అంచనాలు పెంచి బొక్కేసేందుకు జలవనరులశాఖ ద్వారా ప్రతిపాదనలు చేయించినట్లు సమాచారం. నిద్ర లేచింది మొదలు.. అభివృద్ధికి, నీతికి బ్రాండ్ అంబాసిడర్లమంటూ గప్పాలు కొట్టుకునే టీడీపీ నేతలు దొరికిన ప్రతి అవకాశం ద్వారా కాసులు పిండుకునే పనుల్లో ఉన్నారు. దశాబ్దాలుగా పెన్నానది పక్కనే ఉన్న పలు జనావాసాలు ఏటా ముంపునకు గురవుతున్నాయి. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వానికి నదికి రిటైనింగ్ వాల్ నిర్మించాలనే ఆలోచనే రాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండేళ్లు కరోనా విపత్తును ఎదుర్కొని రూ.వంద కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టి సగం పనులు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక పనులు ఆపేసి.. రూ.170 కోట్లు దోచుకునేందుకు పచ్చ బ్యాచ్ ప్లాన్ సిద్ధమైంది.



ఆగిపోయిన రిటైనింగ్‌వాల్ పనులు



రిటైనింగ్ వాల్ పనులు పూర్తి కాకపోవడంతో యంత్రాలతో ఇసుక కట్టపోస్తున్న దృశ్యం



తాత్కాలికంగా ఇసుక బస్తాలు, మట్టితో కట్టలు వేసిన దృశ్యం

నెల్లూరు (వీఆర్‌సీసెంటర్): టీడీపీ.. అంటేనే 'టెండర్ వేయ్.. దోచుకో.. పంచుకో' అనే అర్థమని 'పెన్నానది రిటైనింగ్ వాల్' టెండర్‌తో రుజువైంది. అభివృద్ధి పేరుతో అడ్డంగా దోచుకునేందుకు జిల్లాకు చెందిన ఓ మంత్రి స్కెచ్ వేశారు. గతంలోనూ పేద ప్రజల ఇళ్ల నిర్మాణం పేరుతో సదరు మంత్రి రూ.వేల కోట్లు కాజేశారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరిస్తున్న ఆయన ప్రజాధనాన్ని కాజేసేందుకు వేసిన టెండర్ చూస్తే జిల్లా ప్రజలే కాదు.. రాష్ట్ర ప్రజలూ నివ్వెర పోవాల్సిందే.

14 ఏళ్ల టీడీపీ అధికారంలో ఉన్నా..

సోమశిల జలాశయం నుంచి వరద నీటిని పెన్నాకు విడుదల చేసిన ప్రతిసారి నది పక్కనే ఉన్న లోతట్టు ప్రాంతాలైన భగసింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డి కాలనీ, గాంధీగిరిజన కాలనీ ప్రాంతాలు పూర్తిగా నీట మునిగి ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు. రెండున్నర దశాబ్దాల కాలంలో 14 ఏళ్లు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఏనాడు ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని ఆలోచించలేదు. వరద ముంపు వచ్చినప్పుడు కూడా ఆయా ప్రాంతాల ప్రజలకు సహాయం అందించిన పాపాన పోలేదు.

రిటైనింగ్ వాల్‌కు శాపం..

ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు రూ.100 కోట్ల రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ప్రయోజనంలేదని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రిటైనింగ్ వాల్ పనులను నిలిపివేశారు. రిటైనింగ్ వాల్ పనులు పూర్తికాకపోవడంతో తాజాగా వరదలు రావడంతో నీరు భగత్‌సింగ్ కాలనీలోకి ప్రవేశించకుండా తాత్కాలికంగా ఇసుక బస్తాలు, మట్టి కట్టలు కట్టుతూ ఆ మేరకు నిధులు మెక్కుతున్నారు.

170 శాతం అంచనాలు పెంచి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రిటైనింగ్‌వాల్ నిర్మాణాన్ని విమర్శించిన టీడీపీ నేతలు అదే పనులకు గతంలో ఖరారైన రూ.100 కోట్ల మొత్తంపై 170 శాతం మేర అంచనాలు పెంచి రూ.270 కోట్లకు టెండర్ ఖరారు చేసేందుకు జలవనరుల శాఖాధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపారని విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వం రూ.100 కోట్లతో పూర్తి చేసేందుకు టెండర్లు ఖరారు చేస్తే.. రూ.270 కోట్లకు అంచనాలను పెంచడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెల్లుతున్నాయి.



భగత్‌సింగ్‌కాలనీ వద్ద వరద పొర్లకుండా ఇసుకతో కట్టపోసిన అధికారులు

నాడు కట్టిన రక్షణ గోడ మమ్మల్ని కాపాడింది



గతంలో పెన్నానదికి వరదలు వచ్చిన సమయంలో పక్కనే ఉన్న భగత్‌సింగ్‌కాలనీ పూర్తిగా జలమయం అయింది. కట్టుబట్టతో ఇల్లు, వాకిలి వదిలి పునరావాస కేంద్రాలకు వెళ్లాం. అక్కడే పదిరోజులపాటు ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో గత ప్రభుత్వం వరద నీరు రాకుండా రక్షణ గోడ నిర్మించింది. ఇప్పుడు వచ్చిన వరదను ఆ గోడే మమ్మల్ని కాపాడింది. వరద పెరిగితే.. మళ్లీ కష్టాలు తప్పవు.

– సుబ్బమ్మ, స్థానికురాలు

మరలా జలమయమయ్యేది



పెన్నానదికి వరదలు వచ్చిన ప్రతీసారి నదికి ఆనుకుని ఉన్న భగత్‌సింగ్ కాలనీ జలమయమయ్యేది. ఇళ్లు, సామగ్రి అంతా నీటిలో కొట్టుకుపోయేవి. కానీ గతంలో నిర్మించిన రిటైనింగ్ వాల్ వల్ల వరదనీరు భగత్‌సింగ్ కాలనీకు వచ్చే ప్రమాదం తప్పింది. దీంతో నిశ్చింతంగా ఉన్నాం. ఆ గోడే లేకపోతే మళ్లీ భగత్‌సింగ్‌కాలనీ జలమయమయ్యేది. వరద ఇంతకంటే పెరిగితే నీరొచ్చే అవకాశం ఉంది.

– సుజాత, స్థానికురాలు

రూ.100 కోట్లతో రిటైనింగ్ వాల్‌కు శ్రీకారం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వరుసగా పెన్నానదికి వరదలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నీటి ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలకు అప్పటి ప్రభుత్వం అండగా నిలిచింది. కాలనీ వాసులు పడిన కష్టాలను స్వయంగా చూసి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని భావించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పటి మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ద్వారా ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. పెన్నానదికి ఎంతటి వరదనీరు వచ్చినా భగత్‌సింగ్ కాలనీకు ముప్పు లేకుండా ఉండేందుకు వెంకటేశ్వరపురం పెన్నా బిడ్జి నుంచి జాతీయ రహదారి వద్ద నిర్మించిన నూతన పెన్నాబ్రిడ్జి వరకు 2 కిలో మీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆగమేఘాల మీద రూ.100 కోట్లు మంజూరు చేశారు. 2022 జూలై 13న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు అప్పటి జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. అయితే ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో అడ్డుగా ఉన్న వందలాది ఇళ్లు కోల్పోయే పరిస్థితి ఉండడంతో వాల్ నిర్మాణంలో కొంత మార్పు చేయడంతో 34 ఇళ్లు మాత్రమే కోల్పోవడంతో వారికి నష్ట పరిహారం చెల్లించి పనులను వేగవంతం చేశారు. 50 శాతం పనులు కూడా పూర్తయ్యాయి.



2022లో రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాటి మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ (ఫైల్)

రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి



గత ప్రభుత్వంలో నిర్మించిన రిటైనింగ్‌వాల్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేస్తే పెన్నానదికి ఎంత వరద నీరు వచ్చినా నిశ్చింతంగా వందల కుటుంబాలు నివసిస్తున్న భగత్‌సింగ్‌కాలనీకు ఎలాంటి ముప్పు ఉండదు. ప్రస్తుతం సగం మేర పూర్తి చేసి ఉండడంతో కొంత వరకు ఇబ్బంది లేకుండా ఉన్నాం. వరద స్థాయి పెరిగితే ముప్పు తప్పదు

– ముసలయ్య, స్థానికుడు

ఆ గుంత ఇద్దరి ప్రాణాలు బలిగొంది



భగత్‌సింగ్‌కాలనీ పక్కనే ఉన్న పెన్నానదిలో టీడీపీ నేతలు ఇసుక కోసం భారీగా గుంతలు తవ్వడంతో పెద్దగుంట ఏర్పడి నీరు చేరి ప్రమాదభరితంగా చెరువులా తయారైంది. గతంలో రాత్రి సమయంలో ఈ గుంతలో పడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ గుంతను పూడ్చి వేస్తే ప్రమాదాలు జరగకుండా మహిళలు, పసిపిల్లల ప్రాణాలు పోకుండా చూడాలి.

– మస్తానమ్మ, స్థానికురాలు

సోమశిలకు 37,750 క్యూసెక్కుల వరద



సోమశిల: జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 37,750 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నానదికి 34,978 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 280, కండలేరుకు 10,450 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 72.574 టీయంసీల నీరు నిల్వ ఉంది.

55వేల క్యూసెక్కుల విడుదల

సంగం: సోమశిల నుంచి సంగం బ్యారేజ్‌కు భారీగా వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు సంగం బ్యారేజ్ 50 గేట్లు ఎత్తి 55 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెన్నాలో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా జలకళను సంతరించుకున్న సంగం బ్యారేజ్ వద్ద సందర్శకుల తాకిడి కనిపించింది.

నేటి నుంచి స్కూళ్లకు దసరా సెలవులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అన్ని యాజమాన్యాలు పాటించాలన్నారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు రామాయపట్నం పోర్టుకు కాకాణి

కందుకూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళవారం పరిశీలించనున్నారు. గత ప్రభుత్వ హయంలో ప్రారంభమైన రామాయపట్నం పోర్టు పనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రహణం పట్టింది. గతేదాది కాలంగా రామాయపట్నం పోర్టు పనులు జరగడం లేదు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిని పరిశీలించేందుకు కాకాణి పోర్టు నిర్మాణ ప్రాంతానికి రానున్నారు.

అక్రమ కేసులెన్ని పెట్టినా ఎదుర్కొంటాం

• కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ తదితరులు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధించడం నిత్యకృత్యంగా మారిందన్నారు. జిల్లాలో టీడీపీ నేతలు కొత్త సంస్కృతిని పరవళ్లు తొక్కిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే అనేక మంది తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ చైర్మన్ వీరి చలపతిపై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయడంతో కాకాణి ఆదివారం నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరామర్శించారు. కాకాణి మాట్లాడుతూ వీరి చలపతి అంచెలంచెలుగా రాజకీయంగా ఎదిగిన దళిత నాయకుడని, కూటమి ప్రభుత్వాన్ని, స్థానిక నాయకులను ప్రశ్నించడం జీర్ణించుకోలేక ఆయనపై 16 సెక్షన్లతో కేసు నమోదు చేశారన్నారు. 2023లో జరిగిన దాడికి సంబంధించి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల తర్వాత వీరి చలపతిని ఇబ్బంది పెట్టాలని హత్యాయత్నంతోపాటు, మరో 15 సెక్షన్లతో కేసు నమోదు చేశారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతుందని, ఎటువంటి కేసులు పెట్టాలో, వారిని ఎన్ని రోజులు జైల్లో పెట్టి ఇబ్బందులు పెట్టాలో అనుకూల మీడియాతో వారిపై దుష్ప్రచారం చేయిస్తుందన్నారు. కొత్తగా వచ్చిన మహిళ ఎస్పీపై జిల్లా ప్రజలందరూ ఆశలు పెట్టుకున్నారన్నారు. శాంతి భద్రతలు మెరుగు పడతాయని పక్షపాత వైఖరి లేకుండా పని చేస్తారని జిల్లా ప్రజలందరూ భావించారన్నారు. పాత ఎస్పీ బాటలోనే, కొత్త ఎస్పీ నడవడం బాధాకరమన్నారు. తప్పుడు కేసుపై స్పందించిన పోలీసులు, పోలీసుల 'సాక్షి'గా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి విషయంలో ఎందుకు స్పందించడం లేదో ఎస్పీ సమాధానం చెప్పాలన్నారు. అధికారం ఎల్లకాలం ఒకరి చేతుల్లోనే ఉండని, తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, మీరు పెట్టే అక్రమ కేసులు, వేధింపులతో బాధపడిన, నష్టపోయిన మా నాయకులు, కార్యకర్తల కోసం మేము ఇదే పంథాలో పయనిస్తే, మీ పరిస్థితి ఏంటో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులపై అధికార పార్టీ నాయకులు దాడి చేసినా సర్దుకుపోతున్నారన్నారు. మేము పోలీసులు చేసే అన్యాయాన్ని ప్రశ్నించినా పోలీసు అసోసియేషన్ మాపై మాట్లాడుతుందన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్

• ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు కూటమి ప్రభుత్వ తెర తీసిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. డీసీఎమ్మెఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు అక్రమ అరెస్టు దారుణమన్నారు. రాష్ట్రంలో నూతన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి చివరి మూడేళ్లలో 17 కొత్త మెడికల్ కళాశాలను తీసుకువచ్చి వైద్య విద్యను పేద విద్యార్థులకు చేరువు చేయాలని సంకల్పించారని తెలిపారు. చంద్రబాబు ఇప్పటి వరకు ఒక్క కొత్త మెడికల్ కళాశాలను కూడా తీసుకురాక పోగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. వీటిని వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తుందనే నెపంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ లిక్కర్ కేసు, మైనింగ్ కేసు అంటూ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. వీరి వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులో ఐదుగురి అరెస్ట్

• జిల్లా కేంద్ర కారాగారానికి తరలింపు

నెల్లూరు (క్రైమ్) : కొడవలూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన అక్రమ కేసులో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతితోపాటు మరో నలుగురిని పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంకు చెందిన టీడీపీ నేత మల్లికార్జునపై 2023లో దాడి చేశారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం వీరి చలపతితోపాటు 19 మందిపై కొడవలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి వీరి చలపతిని పోలీసులు అరెస్ట్ చేసి నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఉంచారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న అనపల్లి ఉదయ్‌భాస్కర్, పి. శ్రీకాంత్, బొచ్చు దాసు, వీరి సురేష్ ఆదివారం కొడవలూరు పోలీసుల వద్ద లొంగిపోయారు. దీంతో ఐదుగురికి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించి న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో నిందితులను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

వీరి చలపతికి జ్యుడీషియల్ రిమాండ్



నెల్లూరు (లీగల్): అక్రమ కేసులో నిందితులుగా ఉన్న డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతితోపాటు బొచ్చు దాసు, అనపల్లి ఉదయభాస్కర్, వీరి సురేష్, పానేటి శ్రీకాంత్‌లకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కొడవలూరు మండలం రాజుపాళెంకు చెందిన కరకటి మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో నమోదు చేశారు. ఆదివారం నెల్లూరులోని ఇన్‌చార్జి కోర్టు న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరిచారు. పోలీసుల తరఫున ఏపీపీలు లీలావతి, సుకన్య వాదనలు వినిపించారు. చలపతిరావు తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, పి. ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, 2023లో ఫిర్యాదు ఇచ్చాడని, అయితే 20.09.2025లో పోలీసులు కేసు నమోదు చేయడం చూస్తే ఇది పూర్తిగా రాజకీయ కక్షతో బనాయించారంటూ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి శారదరెడ్డి పోలీసులు నమోదు చేసిన సెక్షన్లలో 120(బీ) ఐపీసీని తొలగించి ఐదుగురికి అక్టోబర్ 3వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని ఉత్తర్వులిచ్చారు.

క్లుప్తంగా

మహిళ మెడలో చైన్ అపహరణ

పొదలకూరు: మహిళ మెడలో చైన్‌ను ఆగంతకులు లాక్కెళ్లిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. నరసింహ కండ్రికలోని మెయిన్ రోడ్డు వద్ద ప్రొవిజన్స్ షాపును గ్రామానికి చెందిన బొగ్గల వెంగమ్మ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమశిల - పొదలకూరు మార్గంలోని దుకాణం వద్దకు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఇద్దరు వచ్చి బైక్‌ను నిలిపారు. వీరిలో ఒకరు దుకాణం వద్దకెళ్లి చిప్స్ ప్యాకెట్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటించి.. ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లాడు. పెనుగులాటలో కొంత తెగిపోయి ఆమె చేతికొచ్చింది. ఆపై అక్కడే సిద్ధంగా ఉన్న బైక్‌పై పొదలకూరు వైపు ఉడాయించారు. సరుడు విలువ రూ.మూడు లక్షలుంటుంది. సమాచారం అందుకున్న ఎస్సై హనీఫ్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొరుటూరులో చోరీ

- రూ.ఐదు లక్షల అపహరణ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఇందుకూరుపేట: ఇంట్లోని వస్తువులను దహనం చేయడంతో పాటు నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండలంలోని కొరుటూరులో చోటుచేసుకుంది. ఎస్సై నాగార్జునరెడ్డి వివరాల మేరకు.. ఏలూరుకు చెందిన రామకృష్ణ కొరుటూరులో చేపల గుంతలను తీసుకొని చేప పిల్లల వ్యాపారాన్ని సాగిస్తూ ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ క్రమంలో పని నిమిత్తం నెల్లూరుకు శనివారం ఉదయం వెళ్లారు. తిరిగి రాత్రొచ్చేసరికి ఇంట్లోని వస్తువులు దహనమవుతుండటాన్ని గమనించారు. హుటాహుటిన లోపలికెళ్లి చూడగా, బియ్యం డ్రమ్ములో దాచి ఉంచిన రూ.ఐదు లక్షలు అపహరణకు గురై ఉన్నాయి. నగదును చోరీ చేసి ఇంట్లోని వస్తువులకు నిప్పు పెట్టారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి ఎస్సై చేరుకొని వివరాలను ఆరాతీశారు. ఆధారాలను క్లూస్‌టీమ్ సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శవమై తేలిన ఇంజినీర్

- కర్నూలు జిల్లాలో ఘటన
- మృతుడు ఆత్మకూరు వాసి


విజయ్‌కుమార్ (ఫైల్)

కోడుమూరు రూరల్: కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని సుంకేసుల డ్యామ్ వద్ద సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ కనిపించకుండాపోయిన విజయ్‌కుమార్ (27) మృతదేహం ఆదివారం లభ్యమైంది. కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం కొట్టాల వద్ద ఉన్న కేసీ కెనాల్‌లో ఓ మృతదేహం తేలుతూ కనిపించడంతో తాలుకా అర్బన్ పోలీసులు ఒడ్డుకు చేర్చి పరిశీలించారు. గూడూరు పీఎస్‌లో ఆచూకీ లేకుండా పోయిన సైట్ ఇంజినీర్‌గా గుర్తించారు. ఆత్మకూరు మండలం గండ్లవేడుకు చెందిన విజయకుమార్ సుంకేసుల డ్యామ్ వద్ద కేఎల్ఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్‌లో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఈ నెల 17 నుంచి కనిపించడంలేదంటూ పోలీసులకు మేనమామ నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. పోలీసులు గాలిస్తున్న వేళ మృతదేహం లభ్యమైంది. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరులో నివాసం ఉంటున్న రాజేంద్ర సంతోష్‌కుమార్ ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రామకోటయ్యనగర్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో స్నేహితుడు మీరాతో ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి మాట్లాడుతుండగా.. నిప్పో సెంటర్‌కు చెందిన కిట్టు, స్నేహితులు టింకూ, చందు, మహేష్, నవీన్ అక్కడికొచ్చి గొడవకు దిగారు. దీంతో పోలీసులకు రాజేంద్ర ఫోన్ చేయడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీన్ని మనస్సులో పెట్టుకొని రాజేంద్ర ఇంటి వద్దకు కిట్టు, టింకూ, చందు మహేష్, నవీన్ ఈ నెల 12న వెళ్లి.. తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ దాడి చేశారు. చుట్టుపక్కల వారు రావడంతో నిందితులు పరారయ్యారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల్లో టింకూ రౌడీషీటరని పోలీసులు చెప్పారు.




విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన కటౌట్


శోభాయమానంగా రాజరాజేశ్వరి దేవస్థానం


మూలస్థానేశ్వరాలయం

సింహపురిలో శరన్నవ శోభ

సింహపురిలో దసరా సందడి నెలకొంది. శరన్నవరాత్రి మహోత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. నగరంలోని జగన్మాత ఆలయాల్లో విశేష పూజలను నిర్వహించనున్నారు. నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి, రాజరాజేశ్వరి, భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి, ఉమామహేశ్వర స్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాలు విద్యుద్దీపాలతో శోభిల్లుతున్నాయి.

– నెల్లూరు(బృందావనం) / సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


శోభిల్లుతున్న కన్యకాపరమేశ్వరి ఆలయం



అక్కడ పాతాళానికి.. ఇక్కడేమో ఆకాశానికి

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు కూటమి ప్రభుత్వ హయాంలో భారీగా నష్టపోతున్నారు. వీరికి కనీస మద్దతు ధర లభించకపోగా.. దళారులు, మధ్యవర్తులు, వ్యాపారులు మాత్రం భారీగా ఆర్జిస్తున్నారు. కూరగాయల ధరల నియంత్రణలో సర్కార్ ఘోరంగా విఫలమవుతోంది. రాయలసీమ జిల్లాల్లో పండే ఉల్లి, టమాటో ధరలు పతనమవుతుండగా, ఇక్కడ మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో కర్షకులున్నారు.

- రాయలసీమ జిల్లాల్లో టమాటో, ఉల్లి ధరలు భారీగా పతనం
- జిల్లాలో మాత్రం పైపైకి
- రైతులకు మిగిలేది శ్రమే
- మధ్యవర్తులకు మాత్రం రూ.కోట్లు

నెల్లూరు(పొగతోట): కూరగాయల ధరల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. రాయలసీమ జిల్లాల్లో తక్కువ రేట్లకు వీటిని కొనుగోలు చేసి, ఇక్కడ అధిక ధరలకు విక్రయించి దళారులు భారీగా ఆర్జిస్తున్నారు. కర్షకులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో మధ్యవర్తులు చెలరేగిపోతున్నారు.

ఇదీ తంతు..

ఉదాహరణకు రాయలసీమ జిల్లాల్లో రైతుల నుంచి టమాటో కిలోను రూ.1.5కు కొనుగోలు చేస్తూ.. జిల్లాలో కిలో రూ.25 నుంచి రూ.35కు విక్రయిస్తుస్తూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. అదే కర్నూలులో ఉల్లిపాయలను కిలో అర్ధ రూపాయికి కొనుగోలు చేసి, ఇక్కడ కిలోను రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. రవాణా, కూలీలు, ఇతర ఖర్చులన్నీ కలుపుకొని కిలోను రూ.ఐదు నుంచి రూ.పదిలోపు విక్రయించేందుకు అవకాశం ఉన్నా, అలా జరగడంలేదు.

నిత్యం 110 టన్నులు అవసరం

జిల్లాలోని 37 మండలాల్లో దాదాపు 25 లక్షల మంది నివసిస్తున్నారు. నిత్యం 100 నుంచి 110 టన్నుల కూరగాయలు, ఉల్లిపాయలు అవసరమవుతాయి. కూరగాయల మార్కెట్లో ధరల నియంత్రణలో తమకు సంబంధం ఉండదని, రైతుబజార్లలో మాత్రమే అవకాశం ఉంటుందని మార్కెటింగ్ శాఖ అధికారులు సమాధానమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలే శాపాలుగా పరిణమిస్తున్నాయి. ఫలితంగా అధిక ధరలకు ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

వ్యాపారులు, దళారులదే రాజ్యం

కూటమి ప్రభుత్వ పాలనలో దళారులు, మధ్యవర్తులు, వ్యాపారులు చెలరేగిపోతున్నారు. ధరలు తగ్గించి రైతుల నుంచి కూరగాయలను వీరు కొనుగోలు చేస్తున్నారు. చేతులు మారి ప్రజల వద్దకొచ్చేసరికి వీటి రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. అనంతపురం, కర్నూలు నుంచి లారీల్లో కూరగాయలు జిల్లాకు రవాణా అవుతున్నాయి. నెల్లూరులోని ఏసీ మార్కెట్లో వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రశ్నిస్తే అమర్యాదగా, వ్యంగ్యంగా మాట్లాడటం నిత్యకృత్యమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.


నవాబుపేటలోని రైతు బజార్‌లో..


తోపుడు బండిపై నాలుగు కిలోలను రూ.100కు విక్రయిస్తూ

శ్రమే మిగులుతోంది

రెండెకరాల్లో వరి.. ఎకరాలో కూరగాయల పంటలను సాగు చేస్తున్నా. ఇతర వ్యాపారాలు తెలియవు. రైతులు చెప్పిన ధరలకు వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. నిల్వ ఉంచితే చెడిపోతాయి. రైతులకు శ్రమ తప్ప ఏమీ మిగలడంలేదు.

– రమణయ్య, రైతు, నెల్లూరు

ప్రభుత్వ వైఫల్యం

అనంతపురం, కర్నూల్లో ధరల్లేక టమాటోలు, ఉల్లిపాయలను రోడ్లపై రైతులు పారబోస్తున్నారు. జిల్లాలోని మార్కెట్లో టమాటో కిలోను రూ.30 నుంచి రూ.35.. ఉల్లిపాయలు కిలోను రూ.30కు విక్రయిస్తున్నారు. అక్కడికీ.. ఇక్కడికీ ధరల్లో భారీ తేడాలున్నాయి. తగ్గించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారు.

– ప్రసాద్, బాలాజీనగర్

రైతుబజార్‌లో తక్కువ ధరకే ఉల్లిపాయలు

కూరగాయల ధరలను నియంత్రించే బాధ్యత మాదికాదు. రైతుబజార్‌లో టమాటో, ఉల్లిపాయలను తక్కువ ధరలకే విక్రయిస్తున్నాం. మదనపల్లి టమాటో, మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉల్లిపాయలను జిల్లా ప్రజలు అధికంగా కొనుగోలు చేస్తారు. నాణ్యతలో తేడాల కారణంగా ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోంది.

– అనిత, మార్కెటింగ్ ఏడీ

ప్రభుత్వాస్పత్రిలో గర్భశోకం

- కన్నీరుమున్నీరైన తల్లి
- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
- ఉదయగిరి సీహెచ్‌సీలో ఘటన


ఒరేయ్ కన్నా.. లేవరా..


పోలీసులతో బంధువుల వాగ్వాదం

ఉదయగిరి: తొలి ప్రసవం కోసం పురిటి నొప్పులతో ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఓ మహిళకు గర్భశోకమే మిగిలింది. వైద్యంలో నిర్లక్ష్యమే నవజాత శిశువు మృతికి కారణమంటూ బాధితురాలి బంధువులు ఉదయగిరి సీహెచ్‌సీ ఎదుట ఆందోళనను చేపట్టారు. పోలీసులు, బాధిత మహిళ బంధువుల వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లికి చెందిన మంజుల పురిటి నొప్పులతో ఉదయగిరిలోని ప్రభుత్వాస్పత్రికి 108లో శనివారం ఉదయం వచ్చారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ ప్రశాంత్ ఆమె పరిస్థితిని గమనించి.. ఇక్కడ సరైన వసతుల్లేని కారణంగా ఆత్మకూరులోని ప్రభుత్వాస్పత్రికి పంపుతామని చెప్పారు. దీంతో అక్కడికి వెళ్లేందుకు గానూ 108 కోసం నిరీక్షించసాగారు. ఈ తరుణంలో గైనకాలజిస్ట్ ఠాగూర్ తాను కాన్పు చేస్తానని.. ఎక్కడికీ వెళ్లొద్దని సూచించారు. ఆపై వైద్యాన్ని ప్రారంభించి నర్సుకు సూచనలు చేశారు. ఈ తరుణంలో డీసీహెచ్ మృదులతో సమావేశ ఏర్పాటు, ఇతర కార్యక్రమాలతో ఆయన పట్టించుకోలేదు. పరిస్థితిని నర్సులు గమనిస్తూ వైద్యుడికి సమాచారమిచ్చినా, పెద్దగా స్పందించలేదు. రాత్రి ఏడు గంటల సమయంలో ఆమెను వైద్యుడు పరీక్షించి మరో ఐదు గంటల్లో ప్రసవమవుతుందని చెప్పి వెళ్లిపోయారు. అప్పటికే ఆమె పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నా, పట్టించుకోలేదు. నొప్పులు తీవ్రం కావడంతో ఆస్పత్రిలోని ఓ గదిలో పడుకున్న వైద్యుడు ఠాగూర్‌ను సిబ్బంది లేపేందుకు యత్నించినా, తలుపును తీయలేదు. పరిస్థితి విషమంగా మారడంతో డ్యూటీ నర్సు అతికష్టంపై అర్ధరాత్రి 12.16 సమయంలో కాన్పు చేశారు. మగబిడ్డ జన్మించినా, చలనం లేకపోవడంతో తీవ్రతను గమనించారు. ఠాగూర్ ఉన్న గది వద్దకెళ్లి తలుపు తట్టినా లేవకపోవడంతో కేకలేయడంతో ఎట్టకేలకు వచ్చారు. బిడ్డకు సీపీఆర్ చేసినా ఫలితం కానరాలేదు. దీంతో బంధువులను పిలిచి వెంటనే నెల్లూరు తీసుకెళ్లాలని సూచించారు. 108లో పంపేందుకు యత్నిస్తుండగా, బిడ్డలో చలనం లేదని, శ్వాస పూర్తిగా ఆగిపోయిందనే అంశాన్ని నిర్ధారించారు. దీంతో తల్లి రోదనకు అంతులేకుండా పోయింది. ఠాగూర్ నిర్లక్ష్యంతోనే బిడ్డను కోల్పోయామంటూ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఘటన స్థలానికి ఎస్సై ఇంద్రసేనారెడ్డి చేరుకొని బంధువులకు సర్దిచెప్పేందుకు యత్నించారు. వైద్యుడిపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ విషయమై వైద్యుడు ఠాగూర్ మాట్లాడుతూ.. సాధారణ కాన్పు కోసం యత్నించానని, ఇలాంటి పరిస్థితి అరుదుగా ఉంటుందని.. బాధితులు అర్థం చేసుకోవాలని కోరారు. కాగా సదరు వైద్యుడిపై గతంలోనూ పలు వివాదాలున్నాయి.

పొదలకూరు నిమ్మ ధరలు

పెద్దవి: రూ.38
సన్నవి: రూ.25
పండ్లు: రూ.15



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.138
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.246
స్కిన్‌లెస్ చికెన్	: రూ.272
లేయర్ చికెన్	: రూ.187



యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు


గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న జేసీబీ

- ప్రైవేట్ పాఠశాల, ఇతర స్థలాలకు తరలింపు
- సెలవు దినాల్లో రెచ్చిపోతున్న మాఫియా

కలిగిరి: మండలంలోని నాగిరెడ్డిపాళెం చెరువు, వాగు నుంచి గ్రావెల్ తవ్వకాలను జోరుగా ఆదివారం చేపట్టారు. సెలవు దినం కావడంతో మాఫియా రెచ్చిపోయింది. తవ్వకాలు జరుపుతున్న సమయంలో సంబంధిత అధికారులకు సమాచారమివ్వడంలేదు. కొందరి అండ చూసుకొని తమ పనిని కానిచ్చి జేబులు నింపుకొంటున్నారు. నాగిరెడ్డిపాళెం నుంచి కలిగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాల, ఇతర స్థలాలకు జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా మట్టిని భారీగా తరలించారు. మీడియా ద్వారా విషయం బయటకు పొక్కడంతో పోలీసులు, ఇరిగేషన్ అధికారులు నిలిపేయించారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ మాట్లాడారు. చెరువు, వాగు నుంచి మట్టిని తరలించిన వారిపై కేసును సోమవారం పెడతామని చెప్పారు. సూత్రధారులు, వాహనాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. కాగా ఎలాంటి అనుమతుల్లేకుండా జాతీయ రహదారిపై ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్నారంటే మాఫియా ఏ స్థాయిలో చెలరేగిపోతోందో అర్థం చేసుకోవచ్చు. సెలవు దినాల్లో అధికారులు స్థానికంగా ఉండకపోవడాన్ని అదునుగా భావించి తమ వ్యవహారాన్ని చక్కబెడుతున్నారు.


మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు